

రోడ్డు పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గన్నేరు పుట్టు పంచాయతీ పరిధిలోని గవ్వలమామిడి గ్రామం సమీపంలో గురువారం ఉదయం తీవ్రమైన వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడి రహదారి పైకి పడ్డాయి. దీంతో బాకూరు-గెడ్డలపాడు-జర్రకొండ ప్రధాన రహదారి పూర్తిగా మూసుకు పోవడంతో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. హుకుంపేట మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు తమర్ల సుబ్బారావు, వార్డు మెంబర్ నూక్కన, సుందర్ రావు, పేసా కమిటీ అధ్యక్షుడు గణేశ్వరరావు, వెంకటరావు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. తామర్ల సుబ్బారావు మాట్లాడుతూ, అధికారులు తక్షణమే యంత్రాలను వినియోగించి రహదారిపై పడిన రాళ్లను, మట్టిని తొలగించాల కోరారు. జర్రకొండ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించాలనీ ఆయన కోరారు.



రోడ్డును పరిశీలిస్తున్న నేతలు

ఉధృతంగానే వాగులు

- జలదిగ్బంధంలోనే గ్రామాలు, రహదారులు
- మన్యంలో కొనసాగుతున్న రాకపోకల కష్టాలు
- బాహ్యప్రపంచానికి దూరంగా గిరిజనం
- సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం
- నిత్యావసరాలు, పిల్లల పాలకు అగచాట్లు
- విద్యుత్, సెల్ సిగ్నల్స్ లేక తెగిన సంబంధాలు




గంగవరంలో రోడ్డుపై నీటి ఉధృతికి నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సులు

మొంథా తుపాన్ తీరం దాటినా, రంపచోడవరం మన్యంలో వర్షాలు, వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. కొండవాగులు ఉప్పొంగి, ఉధృతంగా ప్రవహించడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యావసరాలతోపాటు పిల్లలకు పాలు సైతం దొరకక పలు గ్రామాల వాసులు అల్లాడిపోతున్నారు. విద్యుత్, సెల్‌సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ఇతర ప్రాంతాలతో సమాచార సంబంధాలైనా కొనసాగించలేని దుస్థితి నెలకొందని ఏజెన్సీవాసులు వాపోతున్నారు.

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : బుధవారం అర్ధరాత్రి నుండి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసిన నేపథ్యంలో మండలంలోని మడేరు, లబ్బర్తి, కింద్ర పెద్దేరు, నెల్లిమెట్ల ఒట్టిగడ్డ, గింజర్తి, జి కొత్తపల్లి, తదితర గ్రామాల వద్ద వాగులు ప్రమాద స్థాయిలో ప్రవహించి రోడ్లపైకి నీరు చేరడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు వద్ద అధికారులు పహారా ఏర్పాటు చేశారు. నెల్లిమెట్ల గింజర్తి, ఒట్టిగడ్డ తదితర వాగులను స్థానిక సీఐ గౌరీశంకర్, ఎస్ఐ శివకుమార్, తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపిడిఒ లోకుల యాదగిరేశ్వరావు, పలువురు ప్రజాప్రతినిధులు గురువారం పర్యవేక్షించారు. వాగుల ఉధృతి పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు ఎవరు దాటరాదని ప్రజలకు హెచ్చరించారు. దూసరపాము గ్రామంలో ఇళ్లల్లోకి నీరు చొరబడింది. రహదారులు,లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక గ్రామాల్లో నెలకొరిగిన చెట్లు తొలగింపు, విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించే పనులు చకచకా సాగుతున్నాయి బుధవారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సెల్ నెట్వర్క్‌లు పనిచేయలేదు. అధికారుల సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



అడ్డతీగలలో రహదారికి గండి



దేవీపట్నంలో కూలిన ఇంటిగోడ

గంగవరం : మండలంలోని నెల్లిపూడి గ్రామ శివారులో బురద కాలువ ఉప్పొంగి వంతెన పైనుంచి ప్రవహించడంతో రాకపోకలకు ఇక్కట్లు తప్పలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేష్, రెవెన్యూ సిబ్బంది కాలువ వద్దకు చేరుకుని, ప్రజలను అప్రమత్తం చేశారు. జడేరు కాలువ పొంగి ప్రవహించింది, పోలీస్ సిబ్బంది జగదీష్, కొండ, అశోక్, విఆర్ఒ అప్పలకొండ సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. దీంతో నర్సీపట్నం నుంచి కొయ్యూరు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో కాకరపాడు గ్రామ సమీపంలో కొండవాగు ఉప్పొంగి వంతెనపైనుంచి ప్రవహిస్తోంది. రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు హుటాహుటిన అక్కడకి చేరుకున్నారు. వాగు దాటే సాహసం చేయవద్దని ప్రయాణికులకు సూచించారు.

అడ్డతీగల : అడ్డతీగల పంచాయతీ అనిగేరు గ్రామానికి వెళ్లే రహదారిలో కాలువకు గండిపడడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. రూ.కోటి నిధులతో రోడ్లు, కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, సంబంధిత కాంట్రాక్టర్ అర్థాంతరంగా పనులు వదిలేయడంతో ఇబ్బందులు పడే పరిస్థితిఉంది. దీనిపై ధర్నాలు, ఆందోళనలు చేసినా పట్టించుకునే దిక్కు లేకపోవడంతో ఇపుడీదుస్థితి దాపురించిందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై తహశీల్దార్ దొరకయ్య, ఎంపిడిఒ వివిఎస్.కుమార్ సందర్శించి, పరిస్థితిని పరిశీలించారు. పంచాయతీరాజ్ ఎఇఇతోమాట్లాడి, తక్షణ మరమ్మతులకు సూచించారు. బ్రిడ్జి నిర్మాణాన్ని పున:ప్రారంభించి, పూర్తిచేసే చర్యలు చేపడతామని గిరిజనులకు భరోసానిచ్చారు.

దేవీపట్నం: మొంథా ప్రభావంతో నాలుగు రోజులుగా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తూనే ఉన్నాయి. గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి వాగులు ఉప్పొంగడంతో గోకవరం నుండి పోతవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి ఇందుకూరుపేట గ్రామంలో కట్టుమూరి సత్యనారాయణ పెంకుటిల్లు వంటగది కూలిపోయి ధ్వంసమైంది. వాగులు వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులతో బందోబస్త్ ఏర్పాటు చేశారు.



వాగులు ఉప్పొంగడంతో దేవీపట్నంలో బయటకు వెళ్లలేని స్థితిలో చిక్కుకున్న గిరిజనులు

ఐదు రోజులుగా బాహ్యప్రపంచానికి దూరంగా...

దేవీపట్నం మండలం గుంపెనపల్లె, లక్ష్మీపురం గిరిజన గ్రామాలు ఐదు రోజులుగా బాహ్యప్రపంచానికి దూరంగా ఉన్నాయి. మొంథా తుపాన్ తీరం దాటినా, గురువారం ఉదయం జోరువాన కురవడంతో వాగులన్నీ ఉప్పొంగాయి. ఉధృతంగా ఉన్న వాగులు దాటి వెళ్లి నిత్యవసరాలు తెచ్చుకోలేక ఆకలితో అలమటిస్తుండగా, పాలు లేక పిల్లలు అల్లాడిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులెవరూ తమను పట్టించుకోకపోవడంతో, తాము పడుతున్న కష్టాలను గుంపెనపల్లె వాసులు సోషల్‌మీడియాలో ఏకరువు పెడుతూ, తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఇంటిపై కూలిన భారీ వృక్షం

మారేడుమిల్లి: : మొంథా తుఫాన్ ప్రభావంతో మారేడుమిల్లి పంచాయతీ ముసూరు గ్రామంలో భారీ వక్షం గిరిజన కుటుంబం నివాస గృహంపై పడటంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ప్రాణ నష్టం సంభవించలేదు ఘటన సమాచారం తెలుసుకున్న సర్పంచ్ కొండ జాకబ్, ఉపసర్పంచ్ బొడ్డేటి వీరబాబు వెంటనే అక్కడకు చేరుకుని నష్టాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పంచాయతీ తరపున అన్ని విధాలా సహాయం అందిస్తామని, అలాగే ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, హౌసింగ్ అధికారులు, ఎఇఇ, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.



కొత్తగా నిర్మిస్తున్న ఇంటిపై కూలిన భారీ చెట్టు

సొంతూళ్లకు తిరుగుముఖం

ప్రజాశక్తి -సీలేరు: పునరావస కేంద్రాల్లో ఉన్న గిరిజనులను గురువారం వారి సొంత గ్రామాలకు తిరుగుముఖం పట్టారు. తహశీల్దార్ అన్నాజీ రావు దగ్గరుండి చర్యలు చేపట్టారు. గత తుఫాను వలన జరిగిన నష్టాన్ని, అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. మొంథా తుపాన్ నేపథ్యంలో జీకే వీధి మండలం చట్రాపల్లి, తోకరాయి గ్రామస్తులకు బుధవారం సప్పర్ల, ధారకొండలో పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి వసతిచ ఇతర సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. వైద్య సదుపాయాలు కల్పించారు. ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు పునరావాస కేంద్ర పర్యవేక్షణ బాధ్యతలను తహశీల్దార్ అన్నాజీరావు, సిబ్బంది చేపట్టారు తుఫాన్ ముప్పు తొలగిపోవడంతో జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒల ఆదేశాల మేరకు అధికారులు సమకూర్చిన ప్రత్యేక వాహనాల్లో తిరుగుపయనమన్నారు. అనంతరం వారికి ప్రభుత్వం తరపున నిత్యావసరాల కిట్‌లను అందజేశారు.



పునరావాసం నుంచి ఇళ్లకు వెళుతున్న చట్రాపల్లి, సప్పర్ల బాధితులు

తుపాన్ బాధితులను ఆదుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు



పంచాయతీ గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో లోతా రామారావు

రాజవొమ్మంగి: మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు గురువారం కోరారు. లోదొడ్డి పంచాయతీలో లోదొడ్డి, పూదేడు, కొత్త పూదేడు, పాకవెల్తి,కేశవరం గ్రామాల్లో పర్యటించారు. లోదొడ్డి పాఠశాల, పంట పొలాలను సందర్శించారు. భారీ వర్షాలకు వాటిల్లిన నష్టాలను రైతులు, ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కేశవరం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు, వార్డు సభ్యులు జర్త రాజు మాట్లాడుతూ, తుఫాన్ నేపథ్యంలో ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితి అడిగి తెలుసుకుని, ప్రజలను అప్రమత్తం చేశామన్నారు. పంచాయతీ పరిధిలో ఇళ్లకు నష్టం జరగలేదని, పత్తి, ఇతర పంటలకు కొంత నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల సహాయ కార్యదర్శి వెలుసూరి సత్యనారాయణ, మణుగుల రాజబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తేజ పాల్గొన్నారు.

మొంథాతో తీవ్ర నష్టం

- భయపెడుతున్న గెడ్డలు
- నీట మునిగిన పంట పొలాలు
- నష్టాలపాలైన గిరిజనులు



పాడేరులో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

ప్రజాశక్తి-పాడేరుటౌన్:మొంథా తూఫాన్ ప్రభావంతో జిల్లాలో గత రెండు, మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. గిరిజన గ్రామాలు, మండల కేంద్రాల్లో రహదారులు కోతకు గురయ్యాయి. దీంతో, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. గురువారం మధ్యాహ్నం నుంచి తెరిపించినప్పటికీ చాలా ప్రాంతాల్లో వరద నీరు తొలగిపోలేదు. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఏజెన్సీలో వర్షాలు కొనసాగుతుండగా, మొంథా తూఫాన్ ప్రభావంతో వర్షాలు మరింత ఎక్కువగా కురిసాయి. దీంతో కొండల్లోని ఊటలు అధికమయ్యాయి. ఈ క్రమంలో గెడ్డలు వాగులు, వంకలు ఉధతి కొనసాగుతోంది. ఇప్పటికీ మారుమూల గిరిజన పల్లెల్లో జనజీవనం సాధారణ స్థితికి పూర్తిగా రాలేదు.

పాడేరు మండలంలోని రాయిగెడ్డ కాజ్ వేపై నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతున్నది. దీంతో, ఈ రహదారిలో వాహనాల రాకపోకలు నిలిచి పోయాయి. మోదపుట్టు-అడ్డుమండ మార్గంలో వాగు ఉధృతి తగ్గక పోవడంతో దీనిని దాటడానికి ఎవరు సాహసం చేయడం లేదు. రాకపోకలు నిలిచి పోయాయి. ఈ రహదారిలో వంతెన నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జిల్లాలో వర్షంపాతం వివరాలు

జిల్లాలో అత్యధికంగా అనంతగిరిలో 241, అత్యల్పంగా చింతూరు 10.3 ఎంఎం వర్షపాతం నమోదయిందని అధికార వర్గాలు తెలిపాయి. విఆర్ పురంలో 21, ముంచింగిపుట్టు 62, పెదబయలు 52.7, డుంబ్రిగూడ 96.4, అరకువేలి 145.7, అనంతగిరి 13.8, హుకుంపేట 119.9, పాడేరు 137.7, జిమాడుగుల 111, చింతపల్లి 53.2, జికే వీధి 101.4, కొయ్యూరు 131.3, మారేడుమిల్లి 58.9, దేవీపట్నం 152.4, వై.రామవరం 97.7, అడ్డతీగల 155.9, రాజవొమ్మంగి 97.9, గంగవరం 116.6, రంపచోడవరం 102.4, ఏటపాక 16.4, కూనవరం 20.4, మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని పేర్కొన్నాయి.

హుకుంపేట:మండలంలోని గత్తుం పంచాయతీ నుండి గాలిపాడు రహదారి వర్షాల కారణంగా కోతకు గురై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ విషయమై గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. మొంథా తుఫాన్ ప్రభావంతో రహదారి దెబ్బతినడంతో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ తామర్బ కొండయ్య పడల్, పంచాయతీరాజ్ జూనియర్ ఇంజనీర్ సంజీవరావు, స్థానిక ప్రజలతో కలిసి గురువారం రోడ్డు స్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ మాట్లాడుతూ, "డోలి మోత ఉన్న గ్రామాలకు ట్రైబల్ సబ్ ప్లాన్ నిధులతో రూ.2 కోట్లు బీటి రోడ్డు గ్రాంట్ మంజూరైందన్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రోడ్ల పనులు ప్రారంభిస్తామన్నారు. గత్తుం పంచాయతీ గాలిపాడు మలుపు మధ్య సుమారు 170 మీటర్ల రహదారి కోతకు గురైనట్లు ఆయన పేర్కొన్నారు. గోతులను పూడ్చి, రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ జూనియర్ ఇంజనీర్ సంజీవరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కామరాజు, గ్రామస్తులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేటలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న

మళ్లీ..ప్రయాణ కష్టాలు

-తుపానుకు అస్తవ్యస్తంగా రోడ్లు

ప్రజాశక్తి పాడేరు: మొంథా తుఫాన్ పుణ్యమా అని మైదాన ప్రాంతాలకు వెళ్లి వచ్చే అల్లూరి జిల్లా వాసుల ప్రయాణ అవస్థలు మళ్లీ మొదటికొచ్చాయి. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు తోపాటు సమీప జి. మాడుగుల, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టుతో 5 మండలాల్లోని ప్రజలు మైదాన ప్రాంతంలోని చోడవరం, అనకాపల్లి విశాఖపట్నం, నర్సీపట్నం ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. పాడేరు నుంచి ఈ ప్రాంతాలకు వెళ్లడానికి ఒక్కటే ప్రధాన రహదారి ఉంది. ఈ రోడ్లో మైదాన ప్రాంతం నుంచి పాడేరుకు, అదే విధంగా మన్యం లోని ఆరు మండలాల నుంచి వేలాదిమంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు తోపాటు సరుకులు సామగ్రి రవాణా చేసే భారీ వాహనాలకు కూడా ఇదొక్కటే రహదారి గత్యంతరం. ఈ రోడ్డు దుస్థితి చాలా అద్వాన్నంగా మారిపోయింది.

ఘాట్ రోడ్ దిగువన గరికబంధ నుంచి చోడవరం వడ్డాది మీదుగా వెంకన్నపాలెం వరకు సుమారు 29 కిలోమీటర్ల రహదారి గోతులతో నిండిపోయి చాలా దారుణంగా ఉంది. ఎటువంటి వాహనంలోనైనా ఈ రహదారిలో ప్రయాణించడం అసాధ్యంగా మారింది. దీంతో నిత్యం వాహన ప్రమాదాలు చాలా ఎక్కువ అయ్యాయి. ఈ రహదారి మీదుగా రాకపోకలను సాగించడం దుర్లభంగా మారింది. దీనికి తోడు మొంథా తుఫాన్ కారణంగా రోడ్లు మరింత అద్వాన్నంగా మారాయి. ఒక 15 రోజుల కిందట మెరుగుపరిచిన ఈ రహదారిలోని డైవర్షన్ రోడ్ కూడా తుఫాన్ తాకిడికి మళ్లీ కొట్టుకుపోయింది. ఇక్కడ వంతెన కూలిపోయి మూడేళ్ల అవుతుంది. ఇన్నేళ్ల దీనికి అతిగతి లేదు. డైవర్షన్ రోడ్ నుంచే రాకపోకలు జరుగుతున్నాయి ఈ డైవర్షన్ రోడ్డు కూడా వరదలు భారీ వర్షాలు వచ్చిన సమయాల్లో పూర్తిగా ధ్వంసం అవుతుంది ఇప్పటికీ నాలుగుసార్లు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయింది దీన్ని మళ్ళీ రిపేర్లు మాత్రమే చేస్తున్నారు. వంతెన లేక తరచూ డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోతున్న పరిస్థితుల్లో విశాఖపట్నం అనకాపల్లి వెళ్లే రవాణా వాహనాలు, ప్రయాణికులు ఎటు వెళ్లాలో దిక్కుతోచని పరిస్థితి ఎదురైంది. అల్లూరి జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలతో పాటు ఎన్నో అభివృద్ధి నిర్మాణాలు జరుగుతున్న దృష్ట్యా భారీ వాహనాలు రోజు సామగ్రిని తీసుకురావడానికి ఇదే రహదారిలో వెళ్లి వస్తున్నాయి. తుఫాన్ వరదలు వర్షాలకు ఘాట్ రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లడానికి ఏకైక మార్గంగా ఉన్న ఈ రహదారిని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ రోడ్ లోని కోడూరు ఘాట్ రోడ్ జంక్షన్, కేజే పురం, వడ్డాది ,చోడవరం గోవాడ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గోతులను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు, మన్య ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

జిమాడుగుల:తుపాన్ నేపద్యంలో జీ.మాడుగుల పంచాయతీలో స్థానిక సర్పంచ్ రాంబాబు పర్యటించారు. రోలంగిపుట్టు గ్రామంలో సీదారి మత్యలింగం, జిఎం కొత్తూరులో సీదారి అప్పలమ్మ, ఇల్లు కూలిపోవడంతో సర్పంచ్, కార్యదర్శి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఇల్లు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కోరారు. పలు విధాలుగా నష్ట వాటిల్లితే ఆదుకోవాలని కోరారు.



బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వద్ద దెబ్బతిన్న కాజ్‌వే



జి.మాడుగులలో కూలిన ఇల్లు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నేతలు

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పాడేరు:బీంపోలు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థిని అనుమానాస్పద మృతి పై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను జీవన్ కృష్ణ గురువారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు ప్రభుత్వ గిరిజన వసతి గృహాల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన నిర్లక్ష్యం తీవ్రమైందన్నారు. బింపోల్ హాస్టల్‌లో 5వ తరగతి చదువుతున్న సమారెడ్డి అంజలీ అనే గిరిజన విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం గిరిజన సమాజంలో తీవ్ర కోపాన్ని, కలకలాన్ని కలిగిస్తుందన్నారు.. ఈ దారుణ సంఘటనపై సమగ్ర విచారణ నిర్వహించాలన్నారు. హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం చూపిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లలో సరైన వైద్య సౌకర్యాలు, భద్రతా ప్రమాణాలు, పర్యవేక్షణ లోపాలు ఇటీవల చాలా మంది విద్యార్థుల మరణాలకు కారణమవుతు న్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్షుడు కార్తీక్, జిల్లా కార్యదర్శి జీవన్ మాట్లాడుతూ, "బింపోల్ హాస్టల్‌లో జరిగిన ఈ దుర్ఘటన గిరిజన బాలికల భద్రతను ప్రశ్నార్థకం చేస్తోందన్నారు. విద్యార్థిని కుటుంబానికి తక్షణ రూ. 10 లక్షల నష్టం పరిహారం, ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణోత్సవం

ప్రజాశక్తి -పాడేరు: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన శ్రీనివాస కళ్యాణం ఉత్సవం కనుల పండుగ సాగింది. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పట్టణం లోని పురజనులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రీనివాస కళ్యాణం ప్రాజెక్ట్ ప్రధాన అర్చకులు సాయి స్వామి ఆధ్వర్యంలో పరిచారికలు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా కళ్ళకు కట్టినట్టుగా శ్రీనివాస కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు రెండు గంటల సేపు భక్తులు కళ్యాణాన్ని తిలకిస్తూ
జిల్లా కలెక్టర్, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పిఓ తిరుమని శ్రీ పూజ, సహాయ కలెక్టర్ సాహిత్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి జనసేన నాయకుడు వంపురి గంగులయ్య తదితరులు కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. టీటీడీ కళ్యాణోత్సవ ప్రాజెక్టు సూపరింటెండెంట్లు, చంగల రాయిలు హరికృష్ణ రెడ్డి హిందూ ధర్మ ప్రచార పరిషత్ సూపరింటెంట్లు ఎం కాంతి కుమార్ చంద్రశేఖర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్లు సత్యనారాయణ మహేష్ ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు.

బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మూడు రోజులు పాటు కురిసిన మొంథా తుపానుతో గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. మండలంలోని లోతేరు పంచాయతీ సిరసగూడ, తోడుబంద కురిశిల, బొరకాలువలస, కిక్కిటిగూడ, వంతాలగూడ పలు గ్రామాల్లో ఇల్లులు కూలిపోయాయి. విషయం తెలుసుకున్న పంచాయతీ యువనాయకులు కిల్లో ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం యువ నాయకులు తాంగుల రవి, తాంగుల కనకరాజు, గూబయి వెంకటరావు, కొర్రా మోహన్‌రావు, అప్పలస్వామి లతో కలిసి గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కిల్లో ప్రసాద్ మాట్లాడుతూ, కురిశీల గ్రామానికి చెందిన బిమిడి రఘునాథ్‌కు చెందిన పశువు చనిపోయిందని, సిరసగూడ గ్రామానికి చెందిన వంతల అచ్చమ్మ, రుమాయి చంద్రమ్మల మట్టి ఇళ్లు కూలి పోయాయన్నారు. కురిశీల గ్రామానికి చెందిన బోరి బోరి రాధమ్మ ఇల్లు గోడలు కూలి పోయి తీవ్రంగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఇల్లు కూలిపోయిన నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.బాధితులకు పంచదార, టీ పొడి పంపిణీ చేశారు.

గంజాయి రవాణా అరికట్టేందుకు పక్కా ప్రణాళికలు

- ప్రతి మండలానికి యూత్ క్లబ్ ఏర్పాటు చేయాలి
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : జిల్లాలో గంజాయి రవాణా అరికట్టడానికి పక్కా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో పోలీస్, వ్యవసాయ శాఖ, అటవీశాఖ, ఉద్యాన, వైద్య, విద్య, ఐ సి డి ఎస్, డిఆర్డిఏ, ట్రైబల్ వెల్ఫేర్, ఎక్సైజ్, బ్యాంక్, సిపిఓ అధికారులతో గంజాయి నిర్మూలన కు వివిధ శాఖల కార్యకలాపాలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న కార్యాచరణ ప్రణాళిక అంశాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా నుండి గంజాయి రవాణా చేయడం చాలా కష్టం అనే పరిస్థితిని తీసుకురావాలని పేర్కొన్నారు. జిల్లా లో ఏ ప్రాంతాల నుండి ఎక్కువ గంజాయి రవాణా అవుతుందా అని ఆరా తీశారు. ప్రతి నెల నిర్వహించే సమావేశానికి పూర్తి కీలక పనితీరు సూచికల డేటాతో రావాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లాలో వన్నరబుల్ గ్రామాలు మీద ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలల్లో, కాలేజస్ లో ఫిర్యాదులు బాక్స్ పెట్టాలని, ఫిర్యాదులు ఏమైనా వచ్చాయా అని ఆరా తీశారు. యువత గంజాయి పండించే వైపు ఆకర్షిస్తున్నా కారణాలు వైద్య బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యాసంస్థల్లో స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో యూత్ క్లబ్ ఏర్పాటు చేసి యువతను పాజిటివిటీ వైపు నడిపించే దిశగా నిమగ్నం చేయాలని సూచించారు. ల్లా ఎస్పీ అమిత్ బర్దర్ మాట్లాడుతూ గంజాయి సాగు చేసిన, రవాణా చేసిన వారి మరియు బంధువుల స్థిర ఆస్తులు జప్తు చేస్తామని తెలిపారు. సమాజంలో మార్పు రావాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన గంజాయి స్మగ్లర్లకు ఆశ్రయం కల్పించడం నేరమని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బి ఎస్ నంద్, జిల్ లీడ్ బ్యాంకు మేనేజర్ మోతు నాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి పై బ్రహ్మాజీ, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పరిమళ, జిల్లా ఉద్యాన అధికారి కే బి కర్ణ, పాడేరు రంపచోడవరం చింతూరు ఫారెస్ట్ అధికారులు, ఏపీవో పి టి జి ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు ఇళ్లు మంజూరు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు : తుపాను ప్రభావానికి పేదల ఇళ్లు ధ్వంసమైన పరిస్థితుల్లో గిరిజన కుటుంబాలు కావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని. ప్రభుత్వం ప్రకటించిన సహాయాన్ని తక్షణమే బాధితులకు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పల నరస ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. పాడేరు మండలం డోకులూరు, జి.ముంచింగ్ పుట్ పంచాయతీ పరిధిలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వీ.దాస్, మండల నాయకులు సొమెలి చిట్టిబాబు, జి.ముంచింగ్‌పుట్ సర్పంచ్ కిల్లో సత్యనారాయణలతో కలిసి బాధిత ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటించింది. ఈ మేరకు తుఫాన్ నష్టం పై ఆయన మాట్లాడుతూ, పాడేరు మండలం డోకులూరు, జి.ముంచింగ్‌పుట్ పంచాయతీ పరిధిలో తుపాను బీభత్సం చేత సుమారు 5 మంది పేదల ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. మజ్జి కృష్ణ బాబు ఇంటిని పరిశీలించిన నాయకులు, గిరిజన కుటుంబాలు ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, ఈ విపత్తు వారిని మరింత కష్టాల్లో ముంచిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం, ఇళ్ల పునర్నిర్మాణం అవసరమైన సహకారాలు ఇంకా బాధితులకు చేరలేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సహాయం, ఇళ్ల పునర్నిర్మాణానికి మంజూరు చేసిన మొత్తాన్ని తక్షణమే అందించాలని. ఇళ్లు ధ్వంసమైన ప్రతి కుటుంబానికి కొత్త ఇల్లు కేటాయించాలన్నారు. బాధిత ప్రాంతాల్లో వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, సహాయ ప్యాకేజీని అమలు చేయాలని, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ప్రత్యేక ఇళ్ల మంజూరు పథకాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా అధికారులతో చర్చలు జరుపుతామని, పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మోడల్ కాలనీ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి:కొండచరియల దిగువ భాగంలో ఉన్న గిరిజన గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మోడల్ కాలనీ ఏర్పాటు చేయాలని స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావ కారణంగా కోనాపురం పంచాయతీ పరిధి వంటలమామిడి, సప్పడి గ్రామాలు కొండ చరియల ప్రమాదం అంచులో ఉన్నాయన్నారు. గురువారం పునరావాస కేంద్రమైన బొర్రా బాలుర పాఠశాలలో సందర్శించి బాధితులతో పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భోజనాన్ని స్వయంగా బాధితులకు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ చరియల ప్రమాదం అంచులో దిగువ ప్రాంతంలో ఉన్న వంటల మామిడి 15 కుటుంబాలు, సప్పడి 45 కుటుంబాలకు. రాష్ట్ర ప్రభుత్వం సురక్షిత ప్రాంతంలో మోడల్ కాలనీ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జె. అప్పారావు. సెక్రటరీ మోసెస్, వీఆర్ ఒ. విజయమని, మండల సిపిఎం నాయకులు గెమ్మెల. దేవన్న, మధు మాజీ వైస్ ఉప్ప సర్పంచ్ జె.గుండు పాల్గొన్నారు.



తుపాను బాధితులతో మాట్లాడుతున్న గంగరాజుౌడ్పిటిసి గంగరాజు డిమాండ్

నేరాలు ఘోరాలు

పల్లిగెడ్డలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని మద్ది పంచాయతీ పరిధి తునిపాలెం గ్రామానికి చెందిన కాళ్ల ధనూష (12) పల్లెగెడ్డలో గురువారం గల్లంతైంది. మద్ది జిల్లా పరిషత్ హైస్కూల్లో 7వ తరగతి చదువుతోంది. ప్రభుత్వం ఇచ్చిన తుపాను సెలవులు కారణంగా ఇంటి వద్దే ఉంది. పల్లెగెడ్డలో మంగళ బుధవారం నీరు భయంకరంగా ప్రవహించింది. గురువారం నీరు తగ్గిందని ఆ నోటా ఈ నోటా విన్న పిల్లలు సరదాగా కాజ్‌వే వైపు వెళ్లారు. నలుగురు పిల్లలు కాజ్‌వైపై కాళ్లు, చేతులు కడుక్కొంటూ ఉండగా ధనూష కాలు జారి పడిపోయి గల్లంతైంది. మిగిలిన పిల్లలు కేకలువేయడంతో సమీపంలోనే బట్టలు ఉతుకుతున్న మహిళలకు అక్కడికి చేరుకొని విషయం తెలుసుకొని గ్రామంలోకి వచ్చి చెప్పారు. గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ, విద్యాశాఖ, అగ్నిమాపక, మండల పరిషత్ కార్యాలయ అధికారులు గ్రామానికి చేరుకొని పరిశీలించారు. ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు వచ్చి గాలింపు చేపట్టారు. గురువారం చీకటి పడినా బాలిక ఆచూకీ లభించలేదు.

ధనూషకు తల్లి గౌరి, తండ్రి శ్రీను, అక్క అపర్ణ ఉన్నారు. అపర్ణ పద్మనాభం కెజిబివిలో 9వ తరగతి చదువుతోంది. తల్లి గౌరి బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం విశాఖపట్నం వెళ్లారు. తండ్రి శ్రీను, ధనూష ఇంటి వద్ద ఉన్నారు.

మద్ది గ్రామంలోనికి వెళ్లి వస్తాను ఇంటి దగ్గర ఉండి మధ్యాహ్నం అన్నం తిను అని చెప్పి వెళ్లాలని ఇంతలోనే ఘోరం జరిగిపోయిందని తండ్రి శ్రీను రోధిస్తున్నాడు.

పద్మనాభం తహశీల్దార్ కె.ఆనందరావు, ఎంపిడిఒ కె.రూపేష్, భీమిలి ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, సిఐ శ్రీధర్, ఎస్ఐ సురేష్, మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి, ఎంఇఒ పి.రమణబాబూలాల్, చిట్టివలస అగ్నిమాపక కేంద్రం అధికారి జి శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఆఫీసర్ శ్యామల, విఆర్ఒ అప్పలరాజు, విఆర్ఎ ప్రియాంక, భీమిలి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు, ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ ఎస్.గిరిబాబు, నాయకులు మజ్జి వెంకట్రావు, సన్యాసమ్మ, బి.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ తదితరులు గ్రామానికి చేరుకొని పరిశీలించారు.

గుడిలోవలో లారీ బోల్తా

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గుడిలోవ జాతీయ రహదారిపై గురువారం ఉదయం లారీ బోల్తా పడింది. బెంగళూరు నుంచి కోల్‌కతాకు అల్లం లోడుతో వెళ్తున్న లారీ పెందుర్తి వైపు నుంచి ఆనందపురం వైపు వస్తుండగా గుడిలోవ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనతో రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. లారీ డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి అనంతగిరి: మొంథా తుపాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని టోకూరు సీపీఎం సర్పంచ్ కిల్లో మోస్య డిమాండ్ చేశారు. గురువారం సర్పంచ్ బృందం పంచాయతీ గ్రామాల్లో సందర్శించి జరిగిన ఆస్తి, పంటల నష్టం పై అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ తో పాటు ఉప సర్పంచ్ గెమ్మెల. నర్సన్న, మాజీ సర్పంచ్. సారా. దొన్ను, మాజీ వార్డు సభ్యులు కొర్రా సోమన్న కలిసి చిట్టంపాడు, పూలుగుడ, .బోడగుడ, బలియగుడలో పర్యటించి అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం పై అంచనా వేసి ప్రతి ఒక్క రైతును గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ రాంబాబు, సర్వేయర్ శివకుమార్, విఆర్ఎలు పాల్గొన్నారు

కార్మికులు, రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సిఐటియు నేత రామరాజు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మొంథా తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలతో నాలుగు రోజులుఆ ఇళ్లకే పరిమితమై ఉపాధి కోల్పోయిన భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, హమాలీలు, ఆటో, రిక్షా, ఇతర రంగాల కార్మికులు వ్యవసాయ,ఉపాధి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని భవన నిర్మాణ రంగం జిల్లా కార్యదర్శి, సిఐటియు రంపచోడవరం జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు డిమాండ్ చేశారు. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు ఇతర ఆస్తులపై సర్వే చేసి బాధితులకు తగు పరిహారం చెల్లించాలన్నారు.తుఫాను ప్రభావంతో ఏజెన్సీలో వర్షాలు కొనసాగుతున్న దష్ట్యా కార్మికులు,రైతులు, వ్యవసాయ,ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

తాగునీటి బోరు హెడ్‌ల వితరణ



వితరణ అందజేస్తున్న జెకెసి ట్రస్ట్ ప్రతినిధులు

ప్రజాశక్తి-కూనవరం: : మండలంలోని పంద్రాజు పల్లి, శబరి కొత్తగూడెం గ్రామాలలో ప్రజల తాగు నీటి ఎద్దడి నివారణకు తనవంతుగా జెకె సిటీ ట్రస్ట్ ద్వారా ట్రస్ట్ చైర్మన్, చింతూరు మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ మహ్మద్ జమాల్ ఖాన్ రూ.50వేలు విలువ చేసే రెండు బోరు హ్యాండిల్ సెట్లను వితరణగా అందజేశారు.ఆయా గ్రామస్తులు తాగునీటి సమస్యను డాక్టర్ ఖాన్ దృష్టికి తేగా, ఈ మేరకు సాయం అందించారు. మన్యంలో ముఖ్యంగా విలీన మండలాల్లో ప్రజల మౌలిక అవసరాలతోపాటు కష్టాల్లో ఉన్నవారికి తనవంతుగా సాయం అందిస్తున్న డాక్టర్ జమాల్‌ఖాన్‌కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పసుపులేటి సాల్మన్‌రాజు, ఎండి రియాజ్, పంద్రాజుపల్లి గ్రామస్తులు సోడే ముత్తయ్య, కుడియం శేఖర్, తుష్టి రమేష్ పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై చర్యల్లో కాలయాపన



మాట్లాడుతున్న రవీంద్ర

ప్రజాశక్తి-కూనవరం : మేజర్ పంచాయతీలో అవినీతిపై నోటీసు లిచ్చిన అధికారులు, తగు చర్యలు చేపట్టడంతో జాప్యం తగదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెరపాటి రవీంద్ర ఆరో పించారు. గురువారం టేకులబోరులో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి కిషోర్ అధ్యక్షతన సమావేశంలో మాట్లాడుతూ, అవినీతిపై దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని, నివేదికను ప్రజల ముందు ఉంచాలని కోరారు. అవినీతి ఆరోపణలపై ఇచ్చిన నోటీసుల గడువు ఉముగిసిన నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించాలన్నారు. ఆరోపణలు రుజువైతే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయాలన్నారు. అంబేద్కర్ సంఘం తరపున అవినీతిపై ప్రశ్నిస్తే, తమ వెనుక ఎవరో ఉన్నారని తప్పడు ప్రచారం చేయడం తగదన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షులు కొవ్వాల రాజా, కూనవరం గ్రామస్తులు ఎర్ర చౌదరి, సూరం రాము పాల్గొన్నారు.

అసంపూర్తిగా సచివాలయ భవనాలు

- విధుల నిర్వహణకు సిబ్బంది అవస్థలు
- కాంట్రాక్టర్ల అలసత్వంపై పట్టని అధికారులు



అర్థాంతర నిర్మాణంతో ఆగిపోయిన సచివాలయ సొంత భవనం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండల కేంద్రంతో పాటు పలు పంచాయతీలలో కొత్తగా నిర్మించిన సచివాలయ భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి వీటి నిర్మాణాలు ప్రారంభించి నాలుగేళ్లుగడుస్తున్నా, పూర్తి చేసి వినియోగంలోకి తేవడంలో నిర్లక్ష్యంపై పలువురు విమర్శిస్తున్నారు. దీంతో సొంత భవనాలు లేని పరిస్థితుల్లో పరాయిపంచన, శిథిల భవనాల్లో సచివాలయాల సిబ్బంది విధులు నిర్వహిస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.
ఇటీవల చీడిపాలెం పంచాయతీ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌పై అక్కడి భవనం పైకప్పు పెచ్చులూడి పడడంతో కంప్యూటర్ ధ్వంసమైందన్నారు. దీంతో అక్కడ లబ్ధిదారులకు పనులు జరగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కొయ్యూరులోనే సచివాలయ భవనాలు కూడా మధ్యలోనే ఆగిపోవడంపై కాంట్రాక్టర్ పై ఏ చర్యలు తీసుకోలేదని పలువురు అంటున్నారు. ఐదారు సచివాలయ భవనాల నిర్మాణాలను ఒకే కాంట్రాక్టర్‌కు ఇవ్వడం, అతను పనులను సక్రమంగా చేపట్టకపోవడంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. నిర్మాణ పనుల్లో అలసత్వం చేస్తున్న కాంట్రాక్టర్లపైనా, బాధ్యులైన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పాలకులు పట్టించుకుని, మండలంలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాలను పూర్తి చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు. దీనిపై మండల ఇంజినీరు రామకృష్ణ వివరణ కోరగా, పలుమార్లు సంబంధిత కాంట్రాక్టర్‌కు చెప్పామని, అయినా స్పందన లేకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

పీసా గ్రామసభపై వివాదం

- కోరం లేక వాయిదా : ఎంపిడిఒ
- సమాచారం లేదని సర్పంచ్ ఆగ్రహం



వాయిదా పడిన గ్రామసభలో నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం పంచాయతీలో గురువారం నిర్వహించిన ఏడవ పీసా గ్రామసభ వివాదాస్పదంగా మారింది. సర్పంచ్ మంగ బొజ్జయ్య మాట్లాడుతూ, గ్రామసభ నిర్వహణకు తనకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను హాజరు కాకుండానే గ్రామసభ నిర్వహించేందుకు అధికారులు ప్రయత్నించారని, సభ్యులు హాజరుకాకపోవడంతో మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేచి చూడకుండా ఉదయం 11 గంటలకే గ్రామసభ ముగిసినట్లుగా తీర్మానం రాసి వెళ్లిపోయారని తెలిపారు. అలాగే సభ్యులు హాజరు కాకపోయినా ఆఫీస్ సిబ్బంది, సచివాలయానికి వివిధ పనులపై వచ్చిన వారి పేర్లను రాసి వారినే సభ్యులుగా చూపిస్తూ సంతకాలు చేయించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులను ప్రశ్నించగా, సర్పంచ్‌కు పీసా గ్రామసభకు సంబంధం లేదని చెప్పారనితెలిపారు. ఈ విషయంపై ఎంపిడిఒ స్పందిసూ ప్రత్యేక అధికారి, గ్రామ సర్పంచ్ సమక్షంలో గ్రామసభ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సభకు పంచాయతీలోని ఓటర్లలో కనీసం మూడో వంతు మంది హాజరు కావాల్సి ఉంటుందనాన్రు.గత ఆరు గ్రామసభలు కూడా సభ్యుల హాజరు లేమి కారణంగా నిలుపుదల అయ్యాయన్నారు. . గురువారం కూడా కోరం పూర్తిగా కకపోవడంతో గ్రామసభను వాయిదా వేశామన్నారు. సర్పంచ్‌కు ముందుగానే సమాచారం అందించామని ఎంపిడిఒ స్పష్టం చేశారు.

నిర్వాసితులు కోరుకున్న చోటే పునరావాసం కల్పించాలి



పిఒకు వినతిపత్రం ఇస్తున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-విఆర్ పురం: పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి, వారు కోరుకున్న చోటే పునరావాసం కల్పించాలని వడ్డిగూడెం పంచాయతీ సర్పంచ్ సోడి నర్సమ్మ, వైస్ ఎంపిపి ముత్యాల భవాని, వైసిపి నేతలు కోరారు. వడ్డిగూడెం బిసికాలనీలోని కుటుంబాలను ఆర్‌ఆర్ ప్యాకేజీ జాబితాలో చేర్చి వారికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గురవారం చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి ఆర్‌టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులు కొందరు తిరువూరు పరిసర ప్రాంతాల్లో, మరికొందరు తాడువాయి, కొయ్యలగూడెం వద్ద పునరావాసం కోరుకుంటున్నారని, మెజార్టీ నిర్వాసితుల నిర్వాసితుల అభిప్రాయం మేరకు కొయ్యలగూడెం వద్ద పునరావాసం కల్పించాలని కోరారు. దీనిపై పిఒ స్పందిస్తూ,కొయ్యలగూడెం పరిసర ప్రాంతాలను వెళ్లాలనుకునే నిర్వాసితుల జాబితాను తాము అడిగిన వెంటనే ఇచ్చేలా సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వం కొనే రేటుకు భూమి వస్తే కోరుకున్నచోట పునరావాసం ఇవ్వటానికి అభ్యంతరం లేదన్నారు. వైసిపి మండల నాయకులు ముత్యాల గౌతం ప్రభాకర్, లొల్లా సుధాకర్ ఉన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్



సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలోని రామవరం పంచాయతీ సోములగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను ఎంపిపి కారం లక్ష్మి సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అమలు జరుగు తున్నదీ లేనిదీ ప్రశ్నించారు. సమస్య లేమైనా ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరు కోవాలని ఆకాంక్షించారు. కూలి పనులు చేస్తూ, కష్టబడి చదివిస్తున్న తల్లిదండ్రు లకు మంచి పేరు గౌరవం తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో సోడి. రమా దేవి, దారమ్మ, భద్రమ్మ లక్ష్మి పాల్గొన్నారు..

మోడల్ కాలనీల నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం గాలికొండ పంచాయితీ చట్రాపల్లి, దారకొండ పంచాయతీ తోక రాయి గ్రామస్తులకు పక్కా భవనాలతో మోడల్ కాలనీలను నిర్మించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని జీకే వీధి తహశీల్దార్ అన్నాజీ రావు వెల్లడించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూచట్రాపల్లి గ్రామస్తులకు మోడల్ కాలనీ నిర్మాణానికి సప్పర్లలో స్థల పరిశీలన చేయగా ప్రభుత్వ భూమి లేనట్లు నిర్ధారణ అయిందన్నారు. ఆర్ఒఎఫ్ఆర్ భూమి మాత్రమే ఉందని, ఇంటిస్థలాలకు భూములివ్వడానికి సప్పర్ల రైతులు ముందుకు వస్తున్నారన్నారు. తోకరాయి గ్రామంలో ఇల్లు నిర్మాణానికి ఇంతకుముందు చోడురాయి గ్రామంలో స్థల పరిశీలన చేశామని,అయితే కొన్ని కారణాలతో అక్కడ స్థలం ఎంపిక చేయలేదన్నారు. తోకరాయిలోనే నాలుగు ఎకరాల భూమిని పరిశీలించామని ఆ ప్రదేశంలోనే మోడల్ కోళ్ల నిర్మిస్తామన్నారు. దీనిపై జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు నివేదించామన్నారు. జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు నివేదిక అందజేశామన్నారు.
మొంథా తుఫాన్ ప్రభావంతో మండల పరిధిలో తమ సిబ్బంది చేపట్టిన సర్వేలో 32 ఇళ్లు దెబ్బ తిన్నట్లు గుర్తించారన్నారు. చట్రాపల్లి 32 కుటుంబాలకు, తోకరాయిలో 67 కుటుంబాలకు ప్రభుత్వం తరుపున 25 కేజీలబియ్యం, కేజీ చొప్పున కందిపప్పు , బంగాళాదుంపలు, ఉల్లిపాయలు, పామాయిల్ ప్యాకెట్‌ను కిట్ రూపంలో అందజేస్తామన్నారు. దీని పంపిణీ బాధ్యతలను పౌరసరఫరాల విభాగానికి అందజేశామన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- కొయ్యూరు: తుఫాను నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కొయ్యూరు ఎంపిడిఒ ప్రసాదరావు ప్రజలకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గురువారం డిప్యూటీ ఎంపిడిఒ ఎం. బాబూరావుతో కలిసి మంప పంచాయతీలో పర్యటించారు. మంప, కించెవానిపాలెం గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. పనులు పక్కాగా చేపట్టాలని కార్యదర్శి రవిని ఆదేశించారు

రంపచోడవరాన్ని జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి -సీలేరు:రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లాను ప్రకటించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు డిమాండ్ చేసారు. రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేస్తుందని, దానిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ మేరకు పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలతో చింతూరు, రంపచోడవరం, కెఆర్ పురం డివిజన్లు కలిపి రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు బాధితులను దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం జిల్లాను ప్రకటించాలని కోరారు.